సాక్షి కామారెడ్డి

శుక్రవారం । 19 । జూలై । 2024



చరిత్రాత్మకం..

పంట రుణాల మాఫీ చరిత్రాత్మక నిర్ణయమని బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు.

- 8లో ▸



విజృంభిస్తున్న జ్వరాలు

వ్యాధులు విజృంభిస్తుండడంతో ప్రజలు మంచం పడుతున్నారు. రోగులతో ఆస్పత్రులు కిటకిటలాడుతున్నాయి.

- 9లో ▸

గరిష్టం/కనిష్టం
32.5 /22.7

వాతావరణం

ఉదయం చల్లని గాలులు వీస్తాయి. ఆకాశం మేఘావృతమవుతుంది. అడపాదడపా ఓ మోస్తరునుంచి భారీ వర్షం కురిసే అవకాశాలున్నాయి.

న్యూస్‌రీల్

'శ్రీమంతులు ఊరికి ఉపకారం చేయాలి'



కామారెడ్డి అర్బన్: శ్రీమంతులు తాము చదువుకున్న పాఠశాల అభివృద్ధికి తోడ్పడాలని కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి కోరారు. చిన్నమల్లారెడ్డి గ్రామానికి చెందిన మీసాల వినయ్‌రెడ్డి గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు రూ.లక్ష విలువైన పుస్తకాలు, ప్రయోగ సామగ్రిని అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే కేవీఆర్ దాత వినయ్‌రెడ్డికి సన్మానించారు. అనంతరం పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో హెచ్‌ఎం సాయిరెడ్డి, ఎంఈవో ఎల్లయ్య, అమ్మ ఆదర్శ పాఠశాల అధ్యక్షురాలు శ్రీలత పాల్గొన్నారు.

భారీ వర్షం

సాక్షి, కామారెడ్డి: ఎట్టకేలకు వరుణుడు కరుణించాడు. నెలన్నర రోజుల ఎదురుచూపుల తర్వాత కరుణను వర్షించాడు. గురువారం సాయంత్రం జిల్లావ్యాప్తంగా ఓ మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. జిల్లా కేంద్రమైన కామారెడ్డితో పాటు వివిధ మండలాల్లో భారీ వాన పడింది. వానాకాలం సీజన్ మొదలై నెలన్నర గడచినా సరైన వర్షాలు కురియకపోవడంతో పంటల సాగు పనులు ముందుకు సాగలేదు. ఎట్టకేలకు ఓ మోస్తరు నుంచి భారీ వర్షం కురవడంతో రైతులకు కాస్త ఉపశమనం లభించింది. రెండు మూడు రోజులు ఇలాగే వర్షాలు కురిస్తే కాలువలు, ఒర్రెలు పారే అవకాశం ఉంది.

జిల్లా ఆస్పత్రిలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్

కామారెడ్డి టౌన్: జిల్లాకేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో విద్యుత్ వ్యవస్థలోని లోపాలు బయటపడుతున్నాయి. విద్యుత్ వైర్లు చెడిపోవడంతో గ్రౌండ్ ఫ్లోర్‌లో ఉన్న ఫ్యామిలీ ప్లానింగ్ విభాగంలో గోడలకు విద్యుత్ సరఫరా జరిగింది. దీంతో రోగులు గురువారం రాత్రి ఆందోళనకు గురయ్యారు. అధికారులకు సమాచారం ఇవ్వడంతో వెంటనే అందరూ అప్రమత్తమయ్యారు. ఫ్యామిలీ ప్లానింగ్ విభాగంలో ఉన్న పేషంట్లను హుటాహుటిన రెండో అంతస్తుకు తరలించారు. ఎవరికీ ప్రమాదం జరగకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. ఆస్పత్రి అధికారులు ఎలక్ట్రీషియన్లను పిలిపించి మరమ్మతులు చేయించారు.

తెయూ డిగ్రీ ఫలితాలు విడుదల

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ డిగ్రీ (2021–2024) ఫలితాలు గురువారం సాయంత్రం విడుదలయ్యాయి. రిజిస్ట్రార్ యాదగిరి తన చాంబర్‌లో కంట్రోలర్ అరుణ, అకడమిక్ ఆడిట్ సెల్ డైరెక్టర్ ఘంటా చంద్రశేఖర్‌లతో కలిసి ఫలితాలను విడుదల చేశారు. వర్సిటీ పరిధిలో 2024 మే 21 నుంచి జూన్ 15 వరకు జరిగిన డిగ్రీ పరీక్షల్లో మొత్తం 8,930 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా.. 44.41 శాతంతో 3,966 మంది ఉత్తీర్ణులయ్యారని రిజిస్ట్రార్ తెలిపారు. ఇందులో బాలురు 27.93 శాతం ఉత్తీర్ణులవగా, బాలికలు 55.66 శాతం ఉత్తీర్ణత సాధించారని పేర్కొన్నారు. డిగ్రీ ఫలితాల్లో బాలుర్లపై బాలికలేపై చేయి సాధించారు. కార్యక్రమంలో అడిషనల్ కంట్రోలర్ సాయిలు, నందిని, శాంతాబాయి, పీఆర్‌వో పున్నయ్య, ప్రోగ్రామర్లు సతీశ్, విజయ్, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

లక్షణంగా రుణవిముక్తి!

- అన్నదాతల ఖాతాల్లోకి తొలివిడత మాఫీ సొమ్ము
- జిల్లాలో 49,541 మందికి లబ్ధి
- పంద్రాగస్టులోగా అర్హులందరికీ మాఫీ చేస్తామంటున్న సర్కారు
- రైతు వేదికల్లో ఘనంగా సంబురాలు



కామారెడ్డిలో బైక్ ర్యాలీలో పాల్గొన్న షబ్బీర్ అలీ, కాంగ్రెస్ నాయకులు

సాక్షి, కామారెడ్డి: ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని నిలబెట్టుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం మరో అడుగు ముందుకేసింది. గురువారం లక్ష రూపాయలలోపు పంట రుణాలను మాఫీ చేసింది. ఆయా రైతుల ఖాతాలలో డబ్బులు జమ చేసింది. జిల్లాలో 49,541 మంది రైతులకు సంబంధించిన ఖాతాలలో రూ.235.61 కోట్లు జమయ్యాయి.

అధికారంలోకి వస్తే ఒక్కో రైతుకు సంబంధించి రూ. 2 లక్షలలోపు పంట రుణాలను మాఫీ చేస్తామని అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చిన విషయం తెలిసిందే. ఆ హామీని నిలబెట్టుకోవడానికి ప్రభుత్వం ఇటీవల ప్రక్రియ ప్రారంభించింది. వచ్చేనెల 15వ తేదీలోపు పంట రుణాలను మాఫీ చేస్తామని సర్కారు ప్రకటించింది. ఇందులో భాగంగా 2018 డిసెంబర్ 12 నుంచి 2023 డిసెంబర్ 9 వరకు పంట రుణాలు తీసుకున్న రైతులకు మూడు విడతల్లో గరిష్టంగా రూ.2 లక్షల వరకు పంట రుణాలను మాఫీ చేయడానికి చర్యలు తీసుకుంది. మొదటి విడతలో రూ. లక్షలోపు పంట రుణాలను గురువారం మాఫీ చేసింది. దీనికి సంబంధించిన సొమ్ము రైతుల ఖాతాలలో జమ చేసింది. ఈ నెలాఖరులోపు రెండో విడతకు సంబంధించి రూ.లక్షన్నర వరకు ఉన్న పంట రుణాలను మాఫీ చేస్తామని ప్రభుత్వం ప్రకటించింది. పంద్రాగస్టులోపు చివరి విడతకు సంబంధించిన రుణాలను మాఫీ చేస్తామని పేర్కొంది. రుణమాఫీకి సంబంధించి వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో కలెక్టరేట్‌లో హెల్ప్‌లైన్ ఏర్పాటు చేశారు. ఏవైనా సందేహాలుంటే 72888 94616 నంబరుకు ఫోన్ చేయాలని అధికారులు సూచించారు.

మిన్నంటిన వేడుకలు

పంట రుణాలను మాఫీ చేసిన సందర్భంగా జిల్లా వ్యాప్తంగా సంబురాలు మిన్నంటాయి. జిల్లా కేంద్రంలో కాంగ్రెస్ ఆధ్వర్యంలో భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ పాల్గొన్నారు. అనంతరం కామారెడ్డి మండలం క్యాసంపల్లిలోని రైతు వేదికలో జరిగిన కార్యక్రమంలో షబ్బీర్ అలీతోపాటు కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ పాల్గొన్నారు. బాన్సువాడ నియోజకవర్గంలోని దేశాయిపేటలో సీఎం చిత్రపటానికి ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి, ఆగ్రోస్ చైర్మన్ కాసుల బాల్‌రాజు క్షీరాభిషేకం చేశారు. ఎల్లారెడ్డి పట్టణంలో జరిగిన సంబురాల్లో స్థానిక ఎమ్మెల్యే మదన్ మోహన్‌రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. జుక్కల్ నియోజకవర్గంలోని మహ్మద్‌నగర్‌లో జరిగిన కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు పాల్గొని సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. జిల్లాలోని ఆయా మండలాల్లో రైతు వేదికల వద్ద అధికారులు, రైతులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు సంబురాలు చేసుకున్నారు.

ఆనందంగా ఉంది..



నేను రూ. 36 వేల క్రాప్‌లోన్ తీసుకున్నాను. ప్రభుత్వం ఈ రుణాన్ని మాఫీ చేసినందుకు ఆనందంగా ఉంది. గతంలో దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్ ఒకే విడతలో రుణమాఫీ చేశారు. ఇప్పుడు రేవంత్‌రెడ్డి చేశారు. – కర్రెన లింగయ్య, రైతు, పోసానిపల్లి, ఎల్లారెడ్డి మండలం

రైతులకు మేలు..



ప్రభుత్వం పంట రుణాలను మాఫీ చేస్తున్నందుకు సంతోషంగా ఉంది. ఇది పేద రైతులకు ఎంతో ఉపయోగపడుతుంది. నాకు రూ. 42 వేల క్రాప్ లోన్ మాఫీ అయ్యింది. సీఎంకు కృతజ్ఞతలు. – కొంకి విఠల్, రైతు, బాన్సువాడ

చాలా బాధగా ఉండేది..



పంట సాగు కోసం బ్యాంకులో లోన్ తీసుకున్న. అప్పుకట్టుమని బ్యాంకువాళ్లు అడిగినప్పుడల్లా చాలా బాధ అవుతుండే. సర్కారు మాలాంటి రైతుల బాధ అర్థం చేసుకుని లోన్ మాఫీ చేసినందుకు సంతోషంగా ఉంది. – మంగళి తిరుమలయ్య, ఉప్పర్‌పల్లి, బీబీపేట

మాట ఇస్తే వెనక్కి తగ్గం

- అప్పుడు తెలంగాణ ఇచ్చాం.. ఇప్పుడు రుణమాఫీ చేశాం
- రుణమాఫీ సంబురాల్లో ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ

సాక్షి, కామారెడ్డి: కాంగ్రెస్ పార్టీ మాట ఇస్తే వెనక్కి తగ్గదని, దానిని నిలబెట్టుకుంటుందని ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ పేర్కొన్నారు. గురువారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రాష్ట్ర సచివాలయం నుంచి రైతు నేస్తం, రైతు రుణమాఫీ–2024 నిధుల విడుదల కార్యక్రమాన్ని ప్రారంభించారు. కామారెడ్డి మండలం క్యాసంపల్లి గ్రామంలోని రైతు వేదికలో వీడియో కాన్ఫరెన్సు ద్వారా ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీ, కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా షబ్బీర్‌అలీ మాట్లాడుతూ అప్పట్లో ఎన్ని సమస్యలు ఎదురైనా వెనక్కి తగ్గకుండా సోనియా గాంధీ తెలంగాణ రాష్ట్రం ఇచ్చారని గుర్తు చేశారు. తెలంగాణలో అధికారంలోకి వస్తే రూ. 2 లక్షలలోపు రైతు రుణాలను మాఫీ చేస్తామని వరంగల్ సభలో రాహుల్ గాంధీ హామీ ఇచ్చారని, ఆ వాగ్దానాన్ని ప్రస్తుతం సీఎం రేవంత్‌రెడ్డి అమలు చేశారని పేర్కొన్నారు. అర్హులందరి పంట రుణాలు మాఫీ అవుతాయన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా వ్యవసాయాధికారి భాగ్యలక్ష్మి, మున్సిపల్ చైర్‌పర్సన్ గడ్డం ఇందుప్రియ, డీసీసీ అధ్యక్షుడు కైలాస్ శ్రీనివాస్ రావ్, నాయకులు ఎల్.నర్సింగరావు, మద్ది చంద్రకాంత్‌రెడ్డి, గూడెం శ్రీనివాస్‌రెడ్డి, పండ్ల రాజు, కారంగుల అశోక్‌రెడ్డి, విజయ్‌కుమార్ రెడ్డి, గడ్డం చంద్రశేఖర్‌రెడ్డి, నిమ్మ మోహన్ రెడ్డి, పున్న రాజేశ్వర్, బాల్‌రాజు, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

పట్టణంలో బైక్ ర్యాలీ..

ప్రభుత్వం పంట రుణాలను మాఫీ చేయడంతో గురువారం కామారెడ్డిలో కాంగ్రెస్ నాయకులు బైక్ ర్యాలీ నిర్వహించారు. పట్టణంలోని ప్రధాన వీధుల మీదుగా ర్యాలీ సాగింది. వందలాది మంది కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఈ ర్యాలీలో పాల్గొన్నారు.



క్యాసంపల్లి రైతు వేదికలో సీఎంతో వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీ, కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్, మున్సిపల్ చైర్‌పర్సన్ ఇందుప్రియ తదితరులు

నాగన్నగారి మెట్ల బావి పరిశీలన



మెట్ల బావిని పరిశీలిస్తున్న కేంద్ర బృందం ప్రతినిధులు

లింగంపేట: మండల కేంద్రంలోని చారిత్రక కట్టడమైన నాగన్నగారి బావిని గురువారం కేంద్ర జలశక్తి అధికారి, కేంద్ర విద్యుత్ శాఖ డిప్యూటీ సెక్రెటరీ బెంజమిన్ కరుణాకరన్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మెట్ల బావి పూర్తి స్థాయిలో అభివృద్ధి చెందితే చుట్టుపక్కల భూగర్భ జలాలు వృద్ధి చెందుతాయన్నారు. ప్రభుత్వ నిధులతో రోడ్డు నిర్మాణం, విద్యుత్ దీపాల అలంకరణ చేపట్టి పర్యాటక కేంద్రంగా మార్చనున్నట్లు మండల అధికారులు కేంద్ర బృందానికి వివరించారు. అనంతరం ఆయన బావి పరిసరాల్లో మొక్కలు నాటారు. ఆయన వెంట పాటు కేంద్ర భూగర్భ జల వనరుల శాఖ శాస్త్రవేత్త ఏఎస్ పవార్, ఎంపీడీవో నరేష్, ఏపీఎం శ్రీనివాస్, ఏపీవో అన్నపూర్ణ, పంచాయతీ కార్యదర్శి శ్రావణ్, సీసీలు మెహర్, బాలకిషన్ తదితరులున్నారు.

ప్రాజెక్టు సందర్శన..

నిజాంసాగర్: నిజాంసాగర్ ప్రాజెక్టును గురువారం కేంద్ర జలశక్తి అధికారి బెంజమిన్ కరుణాకరన్ సందర్శించారు. నీటిపారుదల శాఖ అధికారులతో మాట్లాడి ప్రాజెక్టు నిర్మాణంతో పాటు నీటి నిల్వ సామర్థ్యం, వరద నీటి ప్రవాహం, గేట్ల నిర్వహణ తదితర అంశాలను గురించి తెలుసుకున్నారు. ఆయన వెంట నీటిపారుదలశాఖ ఈఈ సోలోమాన్, ఏఈ శివప్రసాద్ తదితరులు ఉన్నారు.

రుణమాఫీని పకడ్బందీగా అమలు చేయాలి

- పంట రుణాలకు మాత్రమే మాఫీ వర్తింపజేయాలి
- బ్యాంకర్లతో సమావేశంలో కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్



మాట్లాడుతున్న కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్



సమావేశంలో పాల్గొన్న బ్యాంకర్లు, అధికారులు

కామారెడ్డి క్రైం: అర్హులైన రైతులందరికీ రుణమాఫీ ప్రక్రియను పకడ్బందీగా అమలు చేయాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో గురువారం బ్యాంకర్లు, వ్యవసాయ శాఖ అధికారులతో సమావేశం నిర్వహించారు. రైతు రుణ మాఫీపై దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడంలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం కుటుంబాన్ని యూనిట్‌గా తీసుకుని పంట రుణాలను మాఫీ చేస్తోందన్నారు. రూ. 2 లక్షలలోపు పంట రుణాలను మూడు విడతల్లో మాఫీ చేయనుందన్నారు. మొదటి విడతలో భాగంగా గురువారం రూ. లక్షలోపు పంట రుణాలను మాఫీ చేసేందుకు చర్యలు తీసుకుందన్నారు.

ప్రతి బ్యాంకులో రుణమాఫీ కోసం ప్రత్యేక నోడల్ అధికారిని నియమించుకోవాలన్నారు. ఎలాంటి సమస్య తలెత్తకుండా సంబంధిత రైతులకు క్రాప్ లోన్ మాఫీ అయ్యేలా చూడాలన్నారు. పంట రుణాలకు మాత్రమే మాఫీ వర్తింపజేయాలన్నారు. అర్హత గల రైతులు ఎవరికైనా రుణమాఫీ రాకపోతే జిల్లా వ్యవసాయ శాఖ కార్యాలయంలో ఏర్పాటు చేసిన హెల్ప్‌లైన్ 99666 49838 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, డీఏవో భాగ్యలక్ష్మి, ఎల్‌డీఎం రవికాంత్, అన్ని శాఖల బ్యాంక్ మేనేజర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

'జల సంరక్షణకు చర్యలు'



కలెక్టర్‌ను కలిసిన కేంద్ర జలశక్తి అధికారులు

కామారెడ్డి క్రైం: జల సంరక్షణకు జిల్లా అధికార యంత్రాంగం తగిన చర్యలు తీసుకుంటోందని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ పేర్కొన్నారు. జిల్లాలో 5 రోజులపాటు పర్యటించిన కేంద్ర జలశక్తి అధికారులు గురువారం కలెక్టరేట్‌లో కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్‌ను కలిశారు. జిల్లాలోని సదాశివనగర్, మాచారెడ్డి, భిక్కనూరు, దోమకొండ, లింగంపేట్, నిజాంసాగర్ మండలాల్లో పర్యటించి చెరువులలో పూడికతీత, ఈత ప్లాంటేషన్, మల్టీ లేయర్ ఎవెన్యూ ప్లాంటేషన్, మ్యాజిక్ సోక్ పిట్, కమ్యూనిటీ మ్యాజిక్ సోక్ పిట్, డ్రాగన్ ఫ్రూట్ ప్లాంటేషన్, నర్సరీ, ఫామ్ పాండ్, ఫిష్ పాండ్, నాగన్న బావి, నిజాంసాగర్ డ్యాంలను పరిశీలించినట్లు కేంద్ర జలశక్తి అధికారులు తెలిపారు. జిల్లాలో వర్షం నీరు సంరక్షణ, భూగర్భ జలాల పెంపునకు ప్రభుత్వం తీసుకున్న చర్యలను పరిశీలించామని పేర్కొన్నారు. జిల్లాలో ఈజీఎస్‌తో పాటు ఇతర నిధులతో చేపడుతున్న నీటి సంరక్షణ పనులు బాగున్నాయన్నారు. జిల్లాలో నీటి వనరుల లభ్యత పెరుగుతోందని తెలిపారు. ఆయా పనులలో మహిళల భాగస్వామ్యం బాగుందని కేంద్ర జలశక్తి అధికారి, కేంద్ర విద్యుత్ శాఖ డిప్యూటీ సెక్రెటరీ బెంజిమెన్ కరుణాకరన్ తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలో జల సంరక్షణకు జిల్లా అధికార యంత్రాంగం చర్యలు తీసుకుంటోందన్నారు. దీనికోసం ఉన్న సంబంధిత పథకాలను సద్వినియోగం చేసుకుంటున్నామన్నారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో కేంద్ర జలశక్తి అధికారి, కేంద్ర గ్రౌండ్ వాటర్ డిపార్ట్‌మెంట్ జూనియర్ సైంటిస్ట్ అధర్వ శ్రీకృష్ణ పవార్, డీఆర్‌డీవో చందర్ నాయక్ తదితరులున్నారు.

దయచేసి కళాశాలకు రండి!

- రామారెడ్డి జూనియర్ కాలేజీకి రాని విద్యార్థులు
- ఇంటింటికి వెళ్లి అవగాహన కల్పిస్తున్న అధ్యాపకులు

రామారెడ్డి: కాలేజీలో ఉండాల్సిన అధ్యాపకులు విద్యార్థుల ఇళ్లకు తిరుగుతున్నారు.. పాఠాలు చెప్పాల్సిన వారు.. కాలేజీకి రమ్మని విద్యార్థులను వేడుకుంటున్నారు. జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో విద్యార్థుల హాజరు శాతం అంతంతమాత్రంగా ఉంటుంది. రామారెడ్డి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో కూడా విద్యార్థులు తరగతులకు రావడం లేదు. దీంతో అధ్యాపకులు ఇంటింటికి తిరుగుతు కాలేజీకి రావాలని కోరుతున్నారు. తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్నారు. రామారెడ్డి కాలేజీలో మొత్తం అన్ని గ్రూపుల్లో కలిసి 145 మంది విద్యార్థులు ఉండగా ఏ రోజు కూడా 50శాతం హాజరు నమోదు కావడం లేదు. గురువారం 41 మంది విద్యార్థులు మాత్రమే హాజరయ్యారు. వీరి కోసం పది మంది లెక్చరర్లు, ప్రిన్సిపాల్ ఇతర సిబ్బంది హాజరయ్యారు. ఇదే కాలేజీలో జూన్‌లో ఒక రోజు ముగ్గురు మాత్రమే వచ్చారు. దీంతో ఇంటర్ ఫలితాల్లో ఫస్టియర్‌లో 95 మందికి ఐదుగురు ఉత్తీర్ణత సాధించగా, ద్వితీయ సంవత్సరంలో 103 మందికి ఆరుగురు పాసయ్యారు.



రామారెడ్డి కళాశాలకు విద్యార్థులు రాకపోవడంతో ఖాళీగా కనిపిస్తున్న బెంచీలు

- రామారెడ్డి ప్రభుత్వ జూనియర్ కాలేజీలో ఎంపీసీ సెకండియర్‌లో మొత్తం 38 విద్యార్థులు ఉండగా గురువారం నలుగురే హాజరయ్యారు. ఈ కళాశాలలో మొత్తం 145 మంది ఉండగా 41 మంది మాత్రమే తరగతులకు హాజరయ్యారు.

జిల్లావ్యాప్తంగా ఇదే పరిస్థితి

జిల్లాలో 20 ప్రభుత్వ జూనియర్ కాలేజీలు ఉన్నాయి. ఇందులో దాదాపు ఆరు వేల మంది వరకు చదువుతున్నారు. కానీ నిత్యం కళాశాలకు రెండు వేల లోపు మాత్రమే హాజరు అవుతున్నారు. 100 మందిపై విద్యార్థులు ఉన్న కాలేజీల్లో ఒక్క రోజూ పది మందిలోపు హాజరు అవుతున్నారు. మాచారెడ్డి జూనియర్ కళాశాలలో గురువారం 200 మందికి 80 మంది కళాశాలకు హాజరయ్యారు. సదాశివనగర్ జూనియర్ కళాశాలలో కూడా 225 మందికి 50% లోపు మాత్రమే వస్తున్నారు. కాగా ఇంటర్ ఫలితాల్లో జిల్లాలో అట్టడుగు స్థానంలో నిలిచింది.

ఫలితాల్లో అట్టడుగుకు..

విద్యార్థులు సక్రమంగా కాలేజీలకు రాకపోవడంతో ఆ ప్రభావం ఫలితాలపై పడుతోంది. దీంతో ఏప్రిల్‌లో విడుదలైన ఇంటర్ ఫలితాల్లో జిల్లా రాష్ట్రంలో అట్టడుగున నిలిచింది. సెకండియర్‌లో 44.29 శాతం, ఫస్టియర్‌లో 34.81 శాతం మాత్రమే ఉత్తీర్ణులయ్యారు. మాచారెడ్డి జూనియర్ కాలేజీలో ఫస్టియర్‌లో 135 మంది విద్యార్థులకు ఒకరే పాస్ అయ్యారంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు.

పర్యవేక్షణ కరువు..

పదో తరగతిలోనే విద్యార్థులకు తల్లిదండ్రులకు అవసరానికి మించిన వసతులు కల్పిస్తున్నారు. ఇంటర్ వచ్చేసరికి స్మార్ట్ ఫోన్, బైకులు ప్రతి విద్యార్థికి సాధారణంగా మారింది. దీంతో మండల కేంద్రాలు, గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న జూనియర్ కళాశాలలో విద్యార్థులు ఇంటి నుంచి బయలుదేరిన కాలేజీలకు వెళ్లడం లేదు. వారు ఎక్కడికి వెళ్తున్నారో తల్లిదండ్రుల పర్యవేక్షణ ఉండడం లేదు. దీంతో విద్యార్థులు తప్పటడుగులేస్తున్నారు. వ్యసనాలకు బానిసలు అవుతున్నారు. తమ పిల్లలు ఉదయమే కళాశాలకు వెళ్లారని తల్లిదండ్రులు భావిస్తున్నారు. కానీ వారు మాత్రం తరగతులకు హాజరు కావడం లేదు. దీంతో రామారెడ్డి కాలేజీలోని అధ్యాపకులు విద్యార్థుల ఇళ్లకు వెళ్లి తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్నారు.



విద్యార్థి ఇంటికి వెళ్ల అవగాహన కల్పిస్తున్న రామారెడ్డి కళాశాల ప్రిన్సిపాల్, లెక్చరర్లు

తల్లిదండ్రులకు వివరిస్తున్నాం



విద్యార్థులు కళాశాలకు రావడం లేదు. రోజు ఫోన్లు చేస్తున్నాం. విద్యార్థుల ఇంటికెళ్లి తల్లిదండ్రులకు అవగాహన కల్పించి కళాశాలకు రప్పించే ప్రయత్నం చేస్తున్నాం. అయినా హాజరు శాతం పెరగడం లేదు. – మధు శ్రీవాత్సవ, ప్రిన్సిపాల్, రామారెడ్డి

తరగతులకు హాజరు కావాలి



విద్యార్థులు నిత్యం తరగతులకు హాజరు కావాలి. లెక్చరర్లు, ప్రిన్సిపాల్స్ విద్యార్థులను కళాశాలకు రప్పించేందుకు అవగాహన కల్పిస్తున్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల్లో మంచి వసతులు, బోధన ఉన్నాయి. విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి. – షేక్ సలాం, ఇంటర్ నోడల్ అధికారి

క్లుప్తంగా

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి



బీబీపేట: గుట్కా, గంజాయితో చాలా మంది జీవితాలు నాశనం అవుతున్నాయని అలాంటి వ్యసనాలకు దూరంగా ఉండాలని ఎక్సైజ్ సీఐ మధుసూదన్‌రావు సూచించారు. గురువారం మండలంలోని మాందాపూర్‌లో గుడుంబా, గంజాయి,డ్రగ్స్ నిర్మూలనపై అవగాహన కల్పించారు.

108,102 వాహనాల తనిఖీ



ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డిలోని 108, 102 వాహనాలను డీపీఎం రవి గురువారం తనిఖీ చేశారు. వాహనాలలోని సామగ్రిని పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ 102 వాహనం ద్వారా గర్భిణులకు సకాలంలో వైద్య సేవలకు అందించాలని అన్నారు. సిబ్బంది సంగాగౌడ్, విజయ్, రమేష్, అరవింద్ తదితరులున్నారు.

తప్పిపోయిన బాలుడి అప్పగింత



బాన్సువాడ: తప్పిపోయిన బాలుడిని బాన్సువాడ పోలీసులు తల్లిదండ్రులకు అప్పగించారు. వివరాలు.. పిట్లం మండలం తిమ్మనగర్‌కు చెందిన దేవసోత్ రేణుక బాన్సువాడలోని తన సోదరుడి ఇంటికి వచ్చింది. తన కుమారుడు చంద్రకాంత్(2)ను అక్కడే వదిలి షాపింగ్‌కు వెళ్లింది. తిరిగి వచ్చేసరికి బాలుడు కనిపించలేదు. కాగా పట్టణంలోని బీసీ హాస్టల్ రోడ్డులో బాలుడు ఒంటరిగా కనిపించడంతో స్థానికులు పోలీసులకు అప్పగించారు. చంద్రకాంత్ పోలీస్ స్టేషన్‌లో ఉన్న విషయం సోషల్ మీడియాలో వైరల్ కావడంతో బాలుడి తల్లిదండ్రులు స్టేషన్‌కు వచ్చి తీసుకెళ్లారు.

ఇద్దరికి డెంగీ!

నిజాంసాగర్: మహమ్మద్‌నగర్ మండల కేంద్రానికి చెందిన ఇద్దరు డెంగీ లక్షణాలతో ప్రైవేట్ ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు. ఇద్దరికి తీవ్రమైన జ్వరంతో పాటు తలనొప్పి ఉండటంతో ఎల్లారెడ్డి, హైదరాబాద్‌లోని ప్రైవేట్ ఆస్పత్రుల్లో చికిత్స చేయించుకున్నారు. అక్కడ పరీక్షలు చేయించగా డెంగీ నిర్ధారణ అయినట్లు తెలిసింది.

పీఆర్‌టీయూ సభ్యత్వ నమోదు



నస్రుల్లాబాద్: ఉపాధ్యాయుల సమస్యలపై పోరాటంలో పీఆర్‌టీయూ ముందు ఉంటుందని జిల్లా ప్రధాన కార్యదర్శి కుషాల్ అన్నారు. గురువారం మండలంలోని నెమ్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆయన సభ్యత్వ నమోదు నిర్వహించారు. మండల అధ్యక్షుడు గునిగెరి హన్మండ్లు, ఉపాధ్యాయులు సుజాత, కొప్పిశెట్టి శ్రీనివాస్, హన్మండ్లు ఉన్నారు.

రైతు రుణమాఫీ చరిత్రాత్మకం

ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి



దేశాయిపేట్‌లో సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే పోచారం, కాసుల బాల్‌రాజ్

బాన్సువాడ/బాన్సువాడ రూరల్: రైతు రుణమాఫీ చరిత్రాత్మక నిర్ణయమని బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. బాన్సువాడ, దేశాయిపేటలో నిర్వహించిన రైతు సంబురాల్లో ఆయన రాష్ట్ర ఆగ్రో ఇండస్ట్రీస్ కార్పొరేషన్ చైర్మన్ కాసుల బాల్‌రాజ్‌తో కలిసి ఆయన పాల్గొన్నారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ, సీఎం రేవంత్‌రెడ్డి చిత్ర పటాలకు క్షీరాభిషేకం చేశారు. పోచారం మాట్లాడుతూ.. దేశ చరిత్రలో ఒకే సారి రూ.2 లక్షలు రైతులకు మాఫీ చేయడం ఎప్పుడు జరగలేదన్నారు. రేవంత్‌రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వంతో ఇది సాధ్యమైందని పేర్కొన్నారు. తాను 2014 నుంచి 2018 వరకు వ్యవసాయ మంత్రిగా ఉన్నప్పుడు రూ.లక్ష వరకు రుణాలను నాలుగు విడతల్లో మాఫీ చేశామని గుర్తు చేశారు. రెండోసారి బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో రూ.20 వేల కోట్లకు రూ.12 వేల కోట్లు మాత్రమే మాఫీ చేశారన్నారు. 40 లక్షల మంది రైతులకు రూ.31 వేల కోట్లు ఒకే సారి రూ.2 లక్షల కాడికి అందించడం భారతదేశంలో ఇదే ప్రథమమని కొనియాడారు. ఇచ్చిన హామీ ప్రకారం ఆగస్టు 15 నాటికి రుణమాఫీ ప్రక్రియ పూర్తవుతుందని తెలిపారు.

అవసరమైతే కొండపోచమ్మ సాగర్ నీరు తెస్తాం

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అనుమతితో నిజాంసాగర్ ప్రాజెక్టు నుంచి సాగుకు నీరు విడుదల చేయించామని పోచారం అన్నారు. రాష్ట్రంలో నిజాంసాగర్ ప్రాజెక్టు కింద మాత్రమే వరి నాట్లు వేశారని పేర్కొన్నారు. ఒకవేళ నీళ్లు తగ్గితే తాను, ఆగ్రో చైర్మన్ కాసుల బాల్‌రాజ్ కలిసి సీఎం దగ్గర వెళ్లి కొండపోచమ్మ సాగర్ నుంచి నీటిని తెచ్చి పంటలను కాపాడుతామని హామీ ఇచ్చారు. కాసుల బాల్‌రాజ్ రాష్ట్ర స్థాయి పదవిలో ఉన్నారని, బయట నుంచి వచ్చిన వారు కొన్నాళ్లు ఉంటారు...తర్వాత సర్దుకుని పోతారన్నారు. నియోజకవర్గ ప్రజలకు అండగా ఉండటానికి తాను, కాసుల బాల్‌రాజ్ కలిసి పని చేస్తామని పోచారం పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ మాజీ చైర్మన్ పోచారం భాస్కర్‌రెడ్డి, నాయకులు అంజిరెడ్డి, అలిబిన్ అబ్దుల్లా, ఖలేక్, నార్ల సురేష్, మోహన్‌నాయక్, జంగం గంగాధర్, నార్ల రత్నకుమార్, కృష్ణారెడ్డి, నాగులగామ వెంకన్న, అసద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి



కామారెడ్డి ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం ఎదుట ఆందోళన చేపడుతున్న ఆశావర్కర్‌లు

కామారెడ్డి క్రైం: తమను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని ఆశావర్కర్లు డిమాండ్ చేశారు. గురువారం సీఐటీయు ఆధ్వర్యంలో కామారెడ్డి ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయాన్ని వారు ముట్టడించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్ మాట్లాడుతూ.. ఆశావర్కర్‌ల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కనీస వేతనం రూ.26 వేలు, ప్రమాద బీమా సౌకర్యం తదితర డిమాండ్‌లను పరిష్కరించాలని కోరారు. అనంతరం క్యాంప్ కార్యాలయ సిబ్బందికి వినతిపత్రం అందజేశారు. ఆశావర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు ఇందిర, కార్యదర్శి రాజశ్రీ, ప్రతినిధులు పద్మ, ప్రమీల, సుధ, శాంత, మంజుల, పుష్పలత పాల్గొన్నారు.

వర్షం పడితే షాక్!



గంగమణి ఇంటిని ఆనుకొని ఉన్న మినీ ట్రాన్స్‌ఫార్మర్లు

భిక్కనూరు: చినుకు పడితే చాలు ఆ ఇంట్లో గోడలకు విద్యుత్ షాక్ వస్తుంది. మండలంలోని జంగంపల్లిలో వడ్ల గంగమణి ఇంటిని ఆనుకొని విద్యుత్ మినీ ట్రాన్స్‌ఫార్మర్లు ఉన్నాయి. దీంతో వర్షం పడినప్పుడు ఆ ఇంటి గోడలకు షాక్ వస్తుంది. ఈ విషయాన్ని పలుమార్లు విద్యుత్ శాఖ అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదని వారు వాపోతున్నారు. దీంతో వాన మొదలవగానే వారు బంధువుల ఇళ్లకు వెళ్లి తలదాచుకుంటున్నారు. అధికారులు చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

హైస్కూల్‌లో కొత్తగా వంద మంది విద్యార్థుల చేరిక

కామారెడ్డి అర్బన్: కామారెడ్డి పట్టణం దేవునిపల్లి ఉన్నత పాఠశాలలో ఈ విద్యాసంవత్సరానికి వంద మందికి పైగా విద్యార్థులు చేరినట్లు హెచ్‌ఎం గంగాకిషన్ తెలిపారు. పాఠశాలలో సౌకర్యాలతో పాటు ఉపాధ్యాయులు, వార్డు కౌన్సిలర్లు కాసర్ల గోదావరి, పి కృష్ణాజీరావుల కృషితో విద్యార్థుల సంఖ్య పెరిగిందన్నారు.

ముగిసిన మొహర్రం



బోర్లంలో దూదిపీర్లతో భక్తులు



నస్రుల్లాబాద్‌లో ఊరేగిస్తున్న పీర్లు

సాక్షి నెట్‌వర్క్: పల్లెల్లో భక్తిశ్రద్ధలతో జరుపుకునే పీర్ల పండుగ గురువారంతో ముగిసింది. నెలవంక కనిపించగానే ఆశీర్‌ఖానాల్లో కొలువుదీరిన పీర్లను అయా గ్రామాల్లోని ముల్లాలు, ఫకీర్లు, దూదేకుల కులస్తులు ఒక్కోరోజు ఒక్కోపీరును బంగారు, వెండి ఆభరణాలు, మల్లెపూలు, రంగురంగుల దట్టీలతో అందంగా అలంకరించి ఊరేగించారు. గురువారం మొహర్రం ముగింపు ఉత్సవాల సందర్భంగా అన్ని పీర్లను గ్రామంలో ఊరేగించగా ప్రజలు మొక్కులు చెల్లించుకున్నారు. దూదేకుల కులస్తులు ఎత్తైన దూదిపీర్లను ప్రతిష్ఠించగా గ్రామస్తులు తమ గ్రామ ఆడపడుచుగా భావించి పీర్లకు ఒడి బియ్యం పోసి సారెలు సమర్పించారు. అసయ్‌దూలా, మజ్నా ఆటలతో భక్తులు ఆకట్టుకున్నారు. సాయంత్రం పీర్లను స్థానిక చెరువుల్లో నిమజ్జనం చేశారు. పలుచోట్ల షర్బత్‌ను పంపిణీ చేశారు.

తెయూ హాస్టల్ భోజనంలో పురుగు

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ హాస్టల్ విద్యార్థినులు గురువారం రాత్రి భోజనం చేస్తుండగా, ఓ విద్యార్థినికి పురుగు రావడంతో ఆందోళనకు గురైంది. ఈనెల 21న విద్యార్థులకు అందించిన అల్పాహారం(టిఫిన్)లో బల్లి వచ్చిన ఘటనను మరువకముందే భోజనంలో పురుగు కనిపించడం కలకలం రేపింది. పురుగు వచ్చిన విషయాన్ని విద్యార్థిని తోటి విద్యార్థినులకు తెలుపడంతో వారంతా భోజనం మానేసి వార్డెన్ కిరణ్మయికి సమాచారం అందించారు. హాస్టల్‌కు చేరుకున్న వార్డెన్ భోజనాన్ని పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు. శుక్రవారం రిజిస్ట్రార్ యాదగిరితో కలిసి హాస్టల్ వంట మనుషులను హెచ్చరిస్తామని, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటామని వార్డెన్ విద్యార్థినులను సముదాయించారు. భోజనం చేయకుండా ఉన్న విద్యార్థినుల కోసం టమాట రైస్ తయారు చేయించారు. భోజనంలో పురుగు వచ్చిన విషయమై విద్యార్థినులు ఫోన్‌లో రిజిస్ట్రార్‌కు ఫిర్యాదు చేశారు.

రుణమాఫీ పేరిట టోకరా!

- ఏపీకే ఫైళ్లు పంపుతున్న సైబర్ నేరస్తులు
- ఇన్‌స్టాల్ చేస్తే ఖాతా ఖాళీ

రామారెడ్డి: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పంట రుణమాఫీని కూడా సైబర్ నేరస్తులు తమకు అనుకూలంగా మార్చుకుంటున్నారు. రుణమాఫీ, పీఎం కిసాన్ పేరిట వాట్సాప్‌కు ఏపీకే ఫైళ్లు పంపుతున్నారు. బుధవారం రాత్రి నుంచే ఏదో బ్యాంకు పేరిట పిక్చర్ లోగోతో వాట్సాప్‌లో ఏపీకే ఫైల్స్ వస్తున్నాయి. వీటిని ఇనస్టాల్ చేస్తే ఫోన్ హ్యాక్ అయి సైబర్ నేరగాళ్ల చేతులోకి వెళ్లిపోతుంది. అనంతరం వారు మన బ్యాంక్ ఖాతాల్లోని డబ్బులను ఖాళీ చేస్తారు. రామారెడ్డి మండలానికి చెందిన ఓ యువకుడు ఏపీకే ఫైల్‌ను ఇన్‌స్టాల్ చేసుకున్నాడు. ఫోన్ హ్యాక్ కాగానే గుర్తించి, ఫోన్‌ను రీసెట్ కొట్టి తప్పించుకున్నాడు. ఏపీకే ఫైళ్లను డౌన్‌లోడ్ చేసుకోవద్దని పోలీసులు సూచిస్తున్నారు.

ఆగస్టు 15లోపు అందరికీ రుణమాఫీ





ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావుకు నాగలి బహూకరిస్తున్న రైతులు, సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తూ..

- ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు

ఎల్లారెడ్డి రూరల్: రైతులందరికీ ఆగస్టు 15లోపు రూ.రెండు లక్షల రుణమాఫీ చేస్తామని ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు అన్నారు. మండలంలోని మీసానిపల్లి రైతువేదికలో నిర్వహించిన రైతు రుణమాఫీ కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. రైతువేదికకు వచ్చిన ఎమ్మెల్యేకు రైతులు నాగలిని బహూకరించారు. అనంతరం సీఎం రేవంత్‌రెడ్డి రైతులతో కలిసి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్సుకు హాజరయ్యారు. సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు రాజీనామా చేసేందుకు సిద్ధంగా ఉండాలన్నారు. రైతు సంక్షేమమే కాంగ్రెస్ లక్ష్యమన్నారు.

సీఎం చిత్రపటానికి పాలాభిషేకం

ఎల్లారెడ్డి: సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటి సీఎం భట్టి విక్రమార్క, మంత్రి తుమ్మల నాగేశ్వర్ చిత్రపటాలకు ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు గురువారం పాలాభిషేకం చేశారు. ఆయన మాట్లాడుతూ.. ఎల్లారెడ్డిలో 17వేల మంది రైతులకు రుణమాఫీ కానుందన్నారు. ఈ కార్యక్రమాల్లో కాంగ్రెస్ మండల, పట్టణ అధ్యక్షులు సాయిబాబా, వినోద్‌గౌడ్, సొసైటీ వైస్ చైర్మన్ ప్రశాంత్‌గౌడ్, మున్సిపల్ మాజీ చైర్మన్ సత్యనారాయణ, కౌన్సిలర్ సత్యనారాయణ, ఆరీఫ్, ఊషాగౌడ్, శ్రీనివాస్‌రెడ్డి, వెంకట్రాంరెడ్డి, సామెల్, శేకావత్, గఫార్, లక్ష్మణ్, సురేందర్, తిరుపతి, విద్యాసాగర్ పాల్గొన్నారు.

రైతు రాజ్యమే కాంగ్రెస్ లక్ష్యం



లింబూర్‌లో ఎడ్లబండిపై వస్తున్న ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు



మహమ్మద్‌నగర్‌లో సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే, నాయకులు

- జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు

నిజాంసాగర్: రైతు రాజ్యమే కాంగ్రెస్ లక్ష్యమని జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు అన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు రేవంత్‌రెడ్డి ప్రభుత్వం రుణమాఫీ అమలు చేసిందన్నారు. గురువారం మహమ్మద్‌నగర్, నిజాంసాగర్, జుక్కల్ మండలాల్లో రుణమాఫీ సంబురాలు, సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం కార్యక్రమాల్లో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులు ఎదురు చూస్తున్న రుణమాఫీ కార్యక్రమాన్ని సీఎం రేవంత్‌రెడ్డి ప్రారంభించారన్నారు. జయప్రదీప్, మల్లికార్జున్, రవీందర్‌రెడ్డి, రమేశ్‌యాదవ్, ఏవో అమర్‌ప్రసాద్ ఉన్నారు.

కాంగ్రెస్‌తోనే రుణమాఫీ సాధ్యమైంది

మద్నూర్: కాంగ్రెస్ ప్రభుత్వంతోనే రుణమాఫీ సాధ్యమైందని ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు పేర్కొన్నారు. డోంగ్లీ మండలం లింబుర్‌లోని రైతు వేదికలో గురువారం ఆయన రైతు నేస్తం కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతు రుణమాఫీ చేస్తామని బీఆర్‌ఎస్ ప్రభుత్వం రైతులను మోసం చేసిందన్నారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల హామీని అమలు చేసిందని చెప్పారు. ఆగస్టు 15లోపు రూ.రెండు లక్షలలోపు రుణాలను ప్రభుత్వం తప్పకుండా మాఫీ చేస్తుందని రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని తెలిపారు. అనంతరం రైతులతో కలిసి ఎమ్మెల్యే గ్రామంలో ఎడ్ల బండిపై ఎక్కి సందడి చేశారు.

దాస్‌నగర్ ఘటనలో గాయపడిన

గురుకుల విద్యార్థిని మృతి

- ఘటనా స్థలంలో తల్లి, ఆస్పత్రిలో పరిస్థితి విషమించి కూతురు..
- చిన్నమావందిలో విషాదఛాయలు



ఈశ్వరి (ఫైల్)

బోధన్‌రూరల్/నిజామాబాద్ నాగారం: మాక్లూర్ మండలం దాస్‌నగర్ వద్ద కారు ఢీకొట్టిన ఘటనలో తీవ్రగాయాలపాలైన మహాత్మా జ్యోతిబా పూలే గురుకులం విద్యార్థిని శ్రీరాం ఈశ్వరి(13) కన్నుమూసింది. ఈనెల 14న జరిగిన ఘటనలో గాయపడిన ఈశ్వరిని నగరంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి గురువారం తెల్లవారుజామున మృతి చెందింది. ప్రమాదం జరిగిన రోజున ఘటనాస్థలంలో ఈశ్వరి తల్లి పద్మ మృతి చెందగా, ఆమె సోదరి గౌతమికి స్వల్ప గాయాలైన విషయం తెలిసిందే. తల్లీ కూతుళ్ల మృతితో బోధన్ మండలం చిన్నమావందిలో విషాదఛాయలు అలుముకున్నాయి. లక్షలు ఖర్చు చేసి ఆపరేషన్ చేయించినా తమ బిడ్డ ప్రాణాలను కాపాడలేకపోయామని తండ్రి, కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరయ్యారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వం నుంచి ఎలాంటి సహాయసహకారాలు అందలేదని, అడిషనల్ కలెక్టర్ వచ్చి పరామర్శించిన వెళ్లినా.. ఈశ్వరికి చికిత్సకు ఎలాంటి ఆర్థిక సహాయం ప్రభుత్వం నుంచి అందలేదని చిన్నమావంది గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈశ్వరి అంత్యక్రియలను గ్రామంలో పూర్తి చేశారు.

వేర్వేరు కారణాలతో ఇద్దరి ఆత్మహత్య

- దోమకొండ మండలం ముత్యంపేటలో విషాదఛాయలు

దోమకొండ: మండలంలోని ముత్యంపేటలో గురువారం ఇద్దరు వ్యక్తులు వేర్వేరు కారణాలతో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నారు. ఒకేరోజు ఇద్దరు ఆత్మహత్య చేసుకోవడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. ఏఎస్సై సుబ్రహ్మణ్యాచారి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి..

ఆర్థిక ఇబ్బందులతో ఒకరు..

వ్యవసాయ పనులు చేస్తూ జీవిస్తున్న బండారి వెంకటస్వామి(53) గతంలో ఇద్దరు కూతుళ్ల పెళ్లిళ్లు చేశాడు. ఇటీవల కుమారుడికి యాక్సిడెంట్ కావడంతో చికిత్స కోసం అప్పులు చేశాడు. ఈ క్రమంలో అప్పులు, ఆర్థిక ఇబ్బందులు ఎక్కువ కావడంతో జీవితంపై విరక్తి చెంది గురువారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి భార్య లక్ష్మీనర్సవ్వ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మద్యానికి బానిసై మరొకరు..

గొర్లు కాస్తూ జీవించే గ్రామానికి చెందిన నంగి రాజయ్య (55) మద్యానికి బానిసై తరచూ ఇంట్లో గొడవ పడుతుండేవాడు. ఈ క్రమంలో జీవితంపై విరక్తి చెంది ఇంటికి సమీపంలోని కొట్టంలో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు, కూతురు ఉన్నారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

క్రైం కార్నర్

చికిత్స పొందుతూ మృతి



బాలయ్య మృతదేహం

మోపాల్(నిజామాబాద్‌రూరల్): భవనం పైనుంచి ప్రమాదవశాత్తు పడి గాయాలపాలైన వ్యక్తి చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందాడు. మండల కేంద్రంలో సలీం అనే వ్యక్తి ఇంటి నిర్మాణ పనులకు వచ్చిన రొడ్డ బాలయ్య (57) ఈనెల 17న రెండో అంతస్తు పైనుంచి ప్రమాదవశాత్తు కిందపడిపోయాడు. వెంటనే అతడిని జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి గురువారం ఉదయం మృతి చెందాడు. మృతుడి కుమారుడు నరేశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై గంగాధర్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన యువకుడు..



ఎజాజ్(ఫైల్)

ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి): రోడ్డు ప్రమాదంలో గాయపడిన యువకుడు చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందినట్లు ఎస్సై మహేశ్ తెలిపారు. ఎల్లారెడ్డి మండలంలోని హాజీపూర్ శివారులో బైక్.. టాటా ఏస్ ఢీకొన్న ఘటనలో ఎజాజ్ (30) గాయాలపాలయ్యాడు. చికిత్స నిమిత్తం హైదరాబాద్‌కు తరలించగా, చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందాడు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

మట్కా నిర్వాహకుల పట్టివేత



బోధన్‌టౌన్(బోధన్): ఆన్‌లైన్‌లో మట్కా నిర్వహిస్తున్న ఇద్దరిని పట్టణంలో గురువారం అదుపులోకి తీసుకున్న టాస్క్‌ఫోర్స్ పోలీసులు తెలిపారు. విశ్వసనీయ సమాచారం అందగా, సీపీ ఆదేశాల మేరకు తనిఖీలు నిర్వహించి ఇద్దరిని అదుపులోకి తీసుకున్నామన్నారు. పట్టుబడిన వారి నుంచి రూ.8,650 నగదు స్వాధీనం చేసుకొని పట్టణ సీఐ వీరయ్యకు అప్పగించినట్లు తెలిపారు. దాడిలో టాస్క్‌ఫోర్స్ ఏసీపీ విష్ణుమూర్తి, సీఐ పురుషోత్తం, సిబ్బంది పాల్గొన్నారు.

నాటుసారా స్వాధీనం



నాటుసారాను చూపుతున్న టాస్క్‌ఫోర్స్ సిబ్బంది

సిరికొండ: మండలంలోని వర్గన్‌తండా, చీమ్యానాయక్ తండా, ఒంటిప్పతండా, గోప్యనాయక్ తండాలపై గురువారం ఎన్‌ఫోర్స్‌మెంట్, టాస్క్‌ఫోర్స్ సిబ్బంది దాడులు చేసినట్లు భీమ్‌గల్ ఎక్సైజ్ సీఐ వేణుమాధవ్‌రావు తెలిపారు. ఆయా తండాల్లో 11 లీటర్ల నాటుసారా, ఇప్పపువ్వుతోపాటు 50లీటర్ల బెల్లం వాష్‌ను స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. నాటు సారా తయారు చేస్తున్న ఐదుగురిపై కేసు నమోదు చేసి, తహసీల్దార్ రవీందర్‌రావు ఎదుట బైండోవర్ చేసినట్లు తెలిపారు. దాడుల్లో ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ వెంకటేశ్, టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ విలాస్, సిబ్బంది పాల్గొన్నట్లు సీఐ తెలిపారు.

ట్రాన్స్‌ఫార్మర్లు ధ్వంసం



ఎడపల్లి (బోధన్): మండలంలోని కుర్నాపల్లి శివారులో అబ్బయ్య దర్గా వద్ద రెండు ట్రాన్స్‌ఫార్మర్లను రైతులు ధ్వంసం చేశారు. గురువారం ఉదయం గ్రామానికి చెందిన రైతులు పంటపొలాల్లోకి వెళ్లేసరికి ట్రాన్స్‌ఫార్మర్లు ధ్వంసమై ఉండడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. 25కేవీ ట్రాన్స్‌ఫార్మర్‌ను ధ్వంసం చేసిన దుండగులు అందులో నుంచి కాపర్‌ను ఎత్తుకెళ్లారని ఫిర్యాదులో పేర్కొన్నారు. పంట పొలాలకు నీరందించడానికి ఇబ్బందులు తప్పవని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.

ఇసుక ట్రాక్టర్..

రుద్రూర్: మంజీరా నది నుండి అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను పొతంగల్ చెక్‌పోస్టు సమీపంలో పట్టుకున్నట్లు ఎస్సై సందీప్ తెలిపారు. ఇసుక లోడ్‌తో వెళ్తున్న ట్రాక్టర్‌ను బుధవారం రాత్రి ఆపి తనిఖీ చేయగా.. ఎలాంటి అనుమతి లేనట్లు నిర్ధారణ కావడంతో పోలీస్‌స్టేషన్‌కు తరలించామని, తదుపరి చర్యల నిమిత్తం సంబంధిత అధికారులకు సమాచారం అందించామన్నారు.

మోటార్ సైకిల్ చోరీ

భిక్కనూరు: మండల కేంద్రంలోని టోల్‌ప్లాజా వద్ద నుంచి దుండగులు మోటార్ సైకిల్‌ను ఎత్తుకెళ్లినట్లు ఎస్సై సాయికుమార్ గురువారం తెలిపారు. ఆర్టీసీలో సూపర్‌వైజర్‌గా పని చేస్తున్న రామేశ్వర్‌పల్లికి చెందిన పైతరి యాదగిరి బుధవారం ఉదయం టోల్ ప్లాజా వద్ద వాహనాన్ని నిలిపి డ్యూటీకి వెళ్లాడు. తిరిగి రాత్రి టోల్‌ప్లాజా వద్దకు రాగా వాహనం కనిపించకపోవడంతో గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

వృద్ధురాలి హత్య కేసులో ఒకరికి జీవితఖైదు

ఖలీల్‌వాడి: వృద్ధురాలి హత్య కేసులో ఆర్మూర్ మండలం ఆలూర్ గ్రామానికి చెందిన వెంకటికి జీవిత కారాగార శిక్ష విధిస్తూ నిజామాబాద్ సెషన్స్ జడ్జి సునీత కుంచాల గురువారం తీర్పు వెలువరించారు. 2008 సంవత్సరంలో నమోదైన కేసుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి.. ఆలూర్‌కు చెందిన కొత్తూరు గంగు(65) తన ఇంటి సమస్యలను గ్రామానికి చెందిన అన్రాసి వెంకటికి చెప్పుకునేంది. ఈ క్రమంలో వెంకటి కన్ను వృద్ధురాలి నగలపై పడింది. మంత్రాలతో నీ సమస్యలను దూరం చేస్తానని గంగును వెంకటి నమ్మించాడు. ఆమె కోడలు పుష్ప బంధువుల ఇంటికి వెళ్లిన సందర్భంలో తన స్నేహితుడు కడమంచి సురేశ్‌తో కలిసి గంగు ఇంటికి వెళ్లిన వెంకటి ఆమెను బైక్‌పై శ్రీరామ్‌సాగర్ బ్యాక్ వాటర్ గ్రామమైన మగ్గిడి శివారు ప్రాంతానికి తీసుకెళ్లాడు. అక్కడ ఆమెపై పసుపు, కుంకుమ చల్లిన వెంకటి.. నీటిలో మునిగిరావాలని సూచించగా, గంగు నీటిలోకి వెళ్లింది. ఇదే అదనుగా భావించిన ఇద్దరు నిందితులు ఆమె గొంతుకు చీరచుట్టి బలంగా లాగి హత్య చేశారని పోలీసులు కేసు నమోదు చేశారు. సాక్ష్యాధారాలు రుజువుకావడంతో ప్రథమ ముద్దాయి వెంకటికి శిక్ష విధిస్తూ న్యాయమూర్తి తీర్పు వెలువరించారు. రెండో ముద్దాయి సురేశ్ తరఫున డిఫెన్స్ న్యాయవాది జీవీ కృపాకర్‌రెడ్డి వాదనలను వినిపించారు. తన క్లైంట్‌కు హత్య, దోపిడీ, సాక్షాల తారుమారుతో సంబంధం లేదని విన్నవించగా, న్యాయవాది వాదనలతో ఏకీభవించిన కోర్టు సురేశ్‌ను నిర్దోషిగా విడుదల చేసింది. పోలీసుల తరఫున పబ్లిక్ ప్రాసిక్యూటర్ పిడుగు రవిరాజ్ ప్రాసిక్యూషన్ నిర్వహించారు.

బైక్‌ల దొంగ అరెస్ట్

భిక్కనూరు: మండల కేంద్రం సమీపంలోని టోల్ ప్లాజా వద్ద వాహనాలను తనిఖీ నిర్వహించి బైక్‌లుచోరీకి పాల్పడుతున్న ఒకరిని అరెస్ట్ చేశామని ఎస్సై సాయికుమార్ గురువారం తెలిపారు. నిందితుడి నుంచి మూడు బైక్‌లు స్వాధీనం చేసుకున్నామన్నారు. రాజంపేట మండలం తలమడ్ల గ్రామానికి చెందిన చమన్ నరేశ్ అనుమానాస్పదంగా వ్యవహరించడంతో అదుపులోకి తీసుకుని విచారించగా, బైక్‌లు చోరీ చేసినట్లు ఒప్పుకున్నాడన్నారు. బుధవారం టోల్‌ప్లాజా వద్ద నుంచి సైతం బైక్‌ను ఎత్తుకెళ్లానని, కామారెడ్డిలో మరో రెండు బైక్‌లను చోరీ చేశానని తెలిపాడు. నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించామని ఎస్సై సాయికుమార్ తెలిపారు.